క్లుప్తంగా

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే బుధవారం తెలిపారు. విద్యార్థుల సౌకర్యం, వారికి అవగాహన కల్పించడం, సందేహాలను నివృత్తి చేయడానికి హెల్ప్ లైన్ సెంటర్‌ను ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ఈనెల 20 నుంచి 26 వరకు, స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్ 25 నుంచి 28 వరకు, వెబ్ ఆప్షన్ నమోదు 24 నుంచి 28వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. 29వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్ మార్చుకోవడానికి అవకాశం ఇచ్చి 31న సీట్లు కేటాయిస్తామన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు కళాశాల తరగతులు సెప్టెంబర్ 1 ప్రారంభం కానున్నాయన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఓసీ విద్యార్థులు రూ.400, బీసీ విద్యార్థులు రూ.300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.200 చెల్లించాలన్నారు. కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో విద్యార్థులు ఆన్‌లైన్‌లో సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వైఎస్సార్ సీపీ రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బాబీకి సత్కారం



వైఎస్సార్ సీపీ రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షుడు జిన్నూరి బాబీని సత్కరిస్తున్న నాయకులు

కడియం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి రామారావు(బాబీ)ని పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కడియంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు(బాబు) స్వగృహంలో బుధవారం జరిగిన ఓ శుభకార్యానికి బాబీ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీని కడియం మండల బ్రహ్మణ సంఘం కోశాధికారి, వైఎస్సార్ సీపీ నేత పున్నమిరాజు వీర్రాజు శాలువాతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ నగర కమిటీ మాజీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరిజాల బాబు, నర్సరీ రైతు ఆరేటి వెంకటరావు పాల్గొన్నారు.

వంద మంది రక్తదానం

రాజమహేంద్రవరం రూరల్: సినీ నటుడు చిరంజీవి జన్మదిన మహోత్సవాల్లో భాగంగా రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో స్థానిక ధన్వంతరి బ్లడ్‌బ్యాంక్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని బొర్లపూడి క్రాంతి ప్రారంభించి, రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. వంద మంది అభిమానులు రక్తదానం చేశారు.

24 నుంచి గణపతి నవరాత్ర ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులో వేంచేసి ఉన్న శ్రీవల్లభగణపతి ఆలయంలో ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు గణపతి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ వ్యవస్థాపకులు సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు కొనసాగనున్నట్టు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు డాక్టర్ టీవీ నారాయణరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా, 25 నుంచి 31వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 7 గంటల నుంచి ఆలయం వద్ద శ్రీమహాదేవానందనాథ ప్రవచన మండపంలో సామవేదం ఆధ్యాత్మిక ప్రవచనాన్ని అందిస్తారని తెలిపారు.

అమరావతిపై దుష్ప్రచారం తగదు

రాజమహేంద్రవరం రూరల్: అమరావతిలో పల్లపు ప్రాంతాన్ని మెరక చేసి రాజధాని నిర్మించనున్నట్టు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బుధవారం బొమ్మూరులోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. రాజధాని అమరావతిపై దుష్ప్రచారం తగదని ఆయన అన్నారు. నేర చరిత్ర కలిగిన రాజకీయ నాయకులున్న నేపథ్యంలో లోక్‌సభలో సెక్షన్ 130 ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఏడీఎంఓ



పీహెచ్‌సీలో వైద్య పరీక్ష చేస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వసుంధర

రాజానగరం: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా అదనపు వైద్యాధికారి (ఏడీఎంఓ) డాక్టర్ ఎస్.వసుంధర బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. టీబీ పేషెంట్ల కార్డులను, లెప్రసీ, ల్యాబ్ రిపోర్టులను, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సమయంలో ఆస్పత్రికి వచ్చిన కొంతమంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్థానిక జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రిలో జరిగిన కోకమిటీ సమావేశానికి హాజరయ్యారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం



రాజవోలు చెరువులో గంబూసియా చేపలను వదులుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు



గంబూసియా చేపలను వదులుతున్న డాక్టర్ అనూహ్య

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ ఏటా మలేరియాతో సుమారు 5 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని, ప్రజల భాగస్వామ్యంతో మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో బ్రిటీష్ వైద్యుడు సర్ రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి ఆయనతోపాటు జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1897లో ఆగస్టు 20న సికింద్రాబాద్ పరిశోధన సంస్థలో బ్రిటిష్ వైద్యుడు సర్ రోనాల్డ్ రాస్ ఆడ ఎనాఫిలిస్ దోమ జీర్ణాశయంలో ప్లాస్మోడియం పరాన్నజీవిని గుర్తించారన్నారు. ఈ ఆవిష్కరణ గౌరవార్థం ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. రాజవోలు చెరువులో గంబూసియా చేపలను డీఎంఅండ్‌హెచ్‌వో, సిబ్బంది వదిలారు. జిల్లాలోని చెరువులు, నీటి గుంటల్లో 3.50 లక్షలు గంబూసియా చేపలను వదిలి దోమల అభివృద్ధిని నియంత్రించే కార్యక్రమం చేపట్టామని డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో దోమల వల్ల సంక్రమించే వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి

కంబాలచెరువు: అంతర్జాతీయ దోమల దినోత్సవం సందర్భంగా స్థానిక కంబాలపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనూహ్య మల్లాది దోమల లార్వాను తినడానికి బుధవారం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూహ్య మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, ఈ వర్షాకాలంలో దోమల వలన వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీహరి, యూపీహెచ్‌సీ హెచ్‌వీ డీడీ భవానీ, ఏఎన్ఎమ్ లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: బొమ్మూరు పవర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నిమిత్తం 22వ తేదీన నాలుగు సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ పరఫరాలో అంతరాయం ఏర్పడనున్నదని ఏపీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శ్యామ్యూల్ బుధవారం ప్రకటించారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కలిగే అంతరాయం ఉంటుందన్నారు. కాటన్ సబ్‌స్టేషన్, ధవళేశ్వరం సబ్‌స్టేషన్, టిడ్కో సబ్ స్టేషన్, బాలాజీపేట సబ్‌స్టేషన్ పరిధిలో బాలాజీపేట, రాజవోలు, ధవళేశ్వరం, హుకుంపేట, నామవరం, శాటిలైట్ సిటీ, మోరంపూడి, వీఎల్ పురం, వెంకటేశ్వరనగర్, ఏవీ అప్పారావు రోడ్డు, తిలక్ రోడ్డు, తాడితోట, రైల్వే స్టేషన్, ఐఎల్‌టీడీ, గణేష్ నగర్, ఎరక్రొండ, ధవళేశ్వరం- ఇండస్ట్రియల్ కాలనీ, వేమగిరి, హార్లిక్స్ ఫ్యాక్టరీ, బొమ్మూరు, జే.ఎన్.రోడ్, రెహ్మత్ నగర్, వాంబే కాలనీ, ఎస్‌వీ మార్కెట్, సంపత్ నగరం, శ్రీకృష్ణపట్నం, పోలీస్ క్వార్టర్స్, ఓఎన్‌జీసీ, గెయిల్ ఆఫీస్, లాలాచెరువు, గోరక్షణ పేట, తాడితోట క్లాత్ మార్కెట్, రామకృష్ణ థియేటర్, ఆల్కాట్ గార్డెన్స్, ఇస్కాన్ టెంపుల్, గౌతమీ ఘాట్, నారాయణపురం, గాంధీపురం, రంభ ఊర్వశి మేనకా థియేటర్లు, స్టేడియం రోడ్డు, సాయికృష్ణ థియేటర్, కలెక్టరేట్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు.

శ్రీమహాలక్ష్మి వ్రతనిధి పుస్తకావిష్కరణ



శ్రీమహాలక్ష్మి వ్రతనిధి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి చిన్నవెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: గురువార శ్రీమహాలక్ష్మి వ్రతనిధి పుస్తకాన్ని ఆవిష్కరించడం పుర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు అనుగ్రహప్రద ఇంటర్నేషనల్ చైర్మన్ ధరణికోట దుర్గవేంకట హేమావతి అన్నారు. బుధవారం గాడాలలోని శ్రీ మహాలక్ష్మి సమేత చిన్నవేంకటేశ్వరస్వామి పీఠంలో ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వ్రత కథకి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి చిన్న వెంకన్న బాబు మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు పీఠంలో తొలిసారిగా ఈ వ్రతం జరుగుతుందన్నారు. వ్రతం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వ్రత కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి గంగాధరరావు, మతల రమేష్, మెగా ఈవెంట్స్ అధినేత్రి ప్రమీల శ్యాంసుందర్, సింగంశెట్టి మహితోష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ‘తెలుగు మాటల పండగ’



సమావేశంలో పాల్గొన్న కార్యనిర్వాహక వర్గం సభ్యులు

సీటీఆర్ఐ: తెలుగు భాష దినోత్సవం సందర్భంగా ఈనెల 29న తెలుగు సారస్వత పరిషత్, కళా గౌతమి, సంయుక్త నిర్వహణలో వారం రోజుల పాటు తెలుగు మాటల పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహక వర్గం సభ్యులు తెలిపారు. బుధవారం స్థానిక సప్పా దుర్గాప్రసాద్ నాట్య నృత్య కళానికేతన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. జక్కంపూడి విజయలక్ష్మి, డాక్టర్ బీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, డాక్టర్ పీవీబీ సంజీవరావు, డాక్టర్ బి.హెచ్‌వీ రమాదేవి, చిర్ల సీతారామనాయుడు కార్యనిర్వాహక వర్గం సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఈనెల 21న ఉదయం 10.30 గంటలకు ఆనం కళాకేంద్రం నన్నయ్య విగ్రహం నుంచి రాజరాజ నరేంద్రుని విగ్రహం వరకు అక్షర దేవతల ఊరేగింపు, 22న జానపద దినోత్సవం సందర్భంగా నేదునూరి గంగాధరం జయంతి నిర్వహిస్తామన్నారు. 23న కళాశాల విద్యార్థులకు ప్రశ్నావళి పోటీ, అన్నమాచార్య కీర్తనలతో అంత్యాక్షరి పాటల పోటీ, 24న తెలుగు పేరంటం, సప్త నదుల జలాలతో గోదావరి మాతకు పూజను నిర్వహిస్తామన్నారు. 25న తెలుగు పరిరక్షణలో తల్లుల పాత్ర అంశంపై మహిళలకు చర్చ, 26న మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక సంహిత కళాశాలలో విద్యార్థులకు పద్య నిధి ప్రసిద్ధ కావ్యాలు, నాటకాలలోని పద్యాలను ఆలపించడం, 27న తెలుగు కళారూపాల ప్రదర్శన, 28న ఉపాధి మార్గం దిశగా తెలుగు అంశంపై చర్చ నిర్వహిస్తామన్నారు. 29న సంహిత డిగ్రీ కళాశాల విద్యార్థులతో గుమిగూడు ఆట (ఫ్లాష్ మాబ్) తెలుగు పాటల ఆలాపన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పంట ఎదుగుదలకు వర్షాలు దోహదం



జేగురుపాడులో పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కడియం: ప్రస్తుతం వర్షపాతం సాధారణ స్థితిలోనే ఉందని, ఎక్కడా ముంపునకు పంట గురికాలేదని, ఇటీవల కురుస్తున్న వర్షాలు పంట ఎదుగుదలకు దోహదం చేస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. బుధవారం జేగురుపాడులో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం వివిధ దశలలో ఉన్న వరి పంటను ఆయన, శాస్త్రవేత్తలు, అధికారులతో కలసి పరిశీలించారు. పాక్షికంగా నీట మునిగిన వరి చేలలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులను రైతులకు ఆయన వివరించారు. ఆకు ముడత, ఆకు నల్లి పురుగులు ఈ వర్షాలకు కొట్టుకుపోయాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు మాట్లాడుతూ ప్రస్తుత ఆగస్టు మాసంలో కురుస్తున్న అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో వరి పంట ఊడ్చిన దశ నుంచి పిలకలు దశలో ఉండగా ముంపునకు గురయ్యాయని తెలిపారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటీయూ 1318, పీఎల్‌ఏ 1100, ఎంటీయూ 1262, స్వర్ణ, సంపద స్వర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయన్నారు. తెగుళ్ల నివారణకు, లీటరు నీటికి 1.0 గ్రా. కార్బెండిజిమ్ లేదా 2.0 గ్రాముల కార్బెండిజిమ్‌తోపాటు మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. మారుటేరు శాస్త్రవేత్త డాక్టర్ పి.రాధిక మాట్లాడుతూ పిలకల దశలో మునిగితే, సాధారణ రకాలు 5 రోజుల వరకు ముంపును తట్టుకుంటాయన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ వేరోనిక మాట్లాడుతూ పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 – 15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాసరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి కె.సూర్యరమేష్, రైతులు పాల్గొన్నారు.

ధర్మ సమ్మేళనానికి తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న రాధామనోహర్‌దాస్ తదితరులు

సీటీఆర్ఐ: స్వామిజీలతో హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనాన్ని సెప్టెంబర్ 14న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్టు ఫోరమ్ ఫర్ హిందూ లాయర్లు, ఇంటలెక్చువల్స్ కో ఆర్డినేటర్ జి.శ్రీకృష్ణకుమార్ వెల్లడించారు. పలువురు స్వామిజీలు, న్యాయవాదులు హాజరవుతారని తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 150 బార్ అసోసియేషన్ల నుంచి 1,500 మంది న్యాయవాదులతో పాటు ధర్మాన్ని కాపాడేందుకు కృషిచేస్తున్న స్వామిజీలు పెద్దఎత్తున హాజరవుతున్నారని వివరించారు. స్వామిజీలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, ఆస్తుల పరిరక్షణ, ధర్మ పరిరక్షణ చేయడానికి కృషి చేస్తామన్నారు. అభయ్ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధా మనోహర్ దాస్ మాట్లాడుతూ ధర్మం కోసం పనిచేసే న్యాయవాదులు దైవం, దేశం కోసం పనిచేయడానికి ముందుకు రావాలన్నారు. సమావేశంలో ఆంజనేయులు, కె.రవి శంకర్, అమత పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విల్సన్‌పాల్

రాజమహేంద్రవరం రూరల్: సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్‌పాల్ డిమాండ్ చేశారు. బుధవారం బొమ్మూరు గ్రామ సచివాలయంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం రాజమండ్రి రూరల్ తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎన్‌వీఎస్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విల్సన్‌పాల్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే సర్వీస్ రూల్స్ జీతభత్యాలకు సంబంధించిన పే స్కేల్ సరిగా లేవని వీటన్నిటిపై ప్రభుత్వం దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలోకి మార్చడం ద్వారా ఒకే శాఖ పరిధిలో పని చేయడం వలన విధి నిర్వహణ సులభతరమవుతుందని తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో తాలూకా యూనిట్ కార్యదర్శి పి.మురళీకృష్ణ, తాలూకా నాయకులు వై. శాంతిరాజు, కె.ఎస్.మూర్తి, ఎస్.మీరాసాహెబ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఓట్ల చోరీకి గురైతే ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ పేర్కొన్నారు. కొంతమూరులోని ప్రకృతి వేదికలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్లమెటరీ నేత రాహుల్ గాంధీ ఓట్ల చోరీపై పోరాడుతున్నారని, ఆయన పోరాటానికి దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. రాహుల్ గాంధీ పోరాటంతో సుప్రీంకోర్టు స్పందించడంతో 56 గంటల్లోనే 65 లక్షల ఓట్లను తిరిగి చేర్చారన్నారు. పోలింగ్ రోజున నమోదైన ఓట్ల శాతానికి, లెక్కింపు రోజున నమోదైన ఓట్ల శాతానికి ఎందుకు తేడా వస్తోందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో గత ఎన్నికల్లో 12.5 శాతం ఓట్ల తేడా వచ్చిందంటే.. ఈ ఓట్లు ఎక్కడి నుంచి పెరిగాయని నిలదీశారు. దేశవ్యాప్తంగా ఈవీఎంలపై అందరిలోనూ సందేహాలు నెలకొన్నాయన్నారు. రాజకీయ నేతలపై కక్షపూరితంగా కేసులు పెడుతున్నారన్నారు. ప్రవీణ్ పగడాల కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, రీ పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి విజయకుమార్, కాటం రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఎగురవేయని మనస్తత్వం జగన్‌ది

రాజమహేంద్రవరం రూరల్: భారతీయుల పండగ ఆగస్టు 15 అని, అలాంటి రోజు జాతీయ జెండాను కూడా ఎగురవేయని మనస్తత్వం ఉన్న వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. బుధవారం బొమ్మూరులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతజాతికి క్షమాపణ చెప్పాల్సింది పోయి ఎదురుదాడి చేస్తున్నారన్నారు. చొక్లెట్లు పంచితే దేశభక్తి ఉన్నట్లా అని మాట్లాడుతున్నారన్నారు. బెట్టింగ్‌రాయుళ్లను, గంజాయిరాయుళ్లను పరామర్శించడానికి జగన్‌కు సమయం ఉందికానీ ఆగస్టు 15న మాత్రం గుర్తులేదన్నారు. అమరావతి ముంపుపై మంత్రిని అడిగిన ప్రశ్నకు ఆయన అమరావతి, తుంగభద్ర కొట్టుకుపోతున్నాయని, విజయవాడ మునిగిపోతోందని సాక్షి మీడియా, వైఎస్సార్ సీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని సమాధానం ఇచ్చారు. ప్రజల్లో ఒక భయాందోళన క్రియేట్ చేయాలన్న ఆలోచనతోనే వైఎస్సార్ సీపీ పనిచేస్తుందన్నారు. చంద్రబాబు సారథ్యంలో వాటర్ మేనేజ్‌మెంట్, ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌తో సుపరిపాలన ఇస్తున్నామన్నారు. రాయలసీమలో రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయని మంత్రి నిమ్మల తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యానికి బలవుతున్న పేదలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో కొందరు వైద్యుల నిర్లక్ష్యానికి పేదలు బలవుతున్నారని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద రోగులకు వైద్యులు మెరుగైన చికిత్స అందించడం లేదని ఆయన మండిపడ్డారు. నగరంలోని సుబ్బారావునగర్‌కు చెందిన జువ్వల రాజేష్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మంగళవారం అర్ధరాత్రి అత్యవసరంగా అతడి కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారని, వైద్యుడు కనీసం రోగిని పరీక్షించకుండా కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి సిఫార్సు చేశారని తెలిపారు. అర్ధరాత్రి అవస్థలు పడుతూ రాజేష్‌ను అతని కుటుంబసభ్యులు కాకినాడకు తరలించారని తెలిపారు. కాకినాడలో వైద్యులు రాజేష్‌ను పరీక్షించి చికిత్స చేసి బుధవారం ఇంటికి పంపించారన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడి తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కొండబాబు తెలిపారు.

సత్యసాయి జ్యోతిని దర్శించుకోండి



సత్య సాయి సేవ మందిరానికి చేరుకున్న జ్యోతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీ సత్య సాయి జ్యోతులు దేశవ్యాప్తంగా తిరుగుతున్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ దర్శించుకుని బాబా అనుగ్రహం పాత్రులు కావాలని శ్రీ సత్య సాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఆల్కాట్ గార్డెన్ శ్రీ సత్య సాయి సేవ మందిరానికి పుట్టపర్తి నుంచి వచ్చిన శ్రీ సత్యసాయి జ్యోతులకు ఆయన స్వాగతం పలికి భక్తులనుద్దేశించి మాట్లాడారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా దివ్య ఆశీస్సులతో అఖిల భారత శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 17న పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్య సాయిబాబా దివ్య సన్నిధిలో ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. దేశంలోని ప్రధాన పట్టణాలు, గ్రామాల్లో శ్రీ సత్యసాయి రన్ అండ్ రైడ్ ఫర్ స్పిరిట్ ఆఫ్ యూనిటీ అనే 5 జ్యోతులతో ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఇందులో 2 జ్యోతులు పుట్టపర్తి నుంచి బయల్దేరి వెస్ట్ బెంగాల్ వెళ్తూ స్థానిక శ్రీ సత్య సాయి మందిరానికి వచ్చాయన్నారు. శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ జ్యోతుల యాత్ర సాగుతుందని ఆయన చెప్పారు. జ్యోతులకు ఘనంగా స్వాగతం పలికి, హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్ష కార్యదర్శులు దండమూడి గిరిధర్, గంట హనుమంతరావు, శ్రీ సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యుల శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు



రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రులు రామానాయుడు, దుర్గేష్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్ / సీటీఆర్ఐ : రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కేంద్రాల ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో, ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్ కేంద్రాన్ని రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. దీనికి సంబంధించిన సభను రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతలోని ప్రతిభకు సాంకేతిక సహకారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ, జేసీ ఎస్ చిన్నరాముడు, గ్రీన్ కోర్ చైర్మన్ జీ. రాంబాబు, నన్నయ యూనివర్సిటీ వీసీ వి.ప్రసన్న, జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్యరాజు), ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ శేషారెడ్డి, ఎస్ఐటీ ప్రతినిధి రవికిరణ్ శాస్త్రి, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రతినిధి శ్రీరామ్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బిక్కవోలు: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలుకు చెందిన కొమ్ము రాణి కుమార్తె ఈ నెల 19న అదే గ్రామానికి చెందిన తన పిన్ని మాణిమాలకు ఇంటికి వెళ్లింది. చీకటి పడినా తన కుమార్తె తిరిగి రాక పోవడంతో రాణి తన చెల్లి, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దమ్ము ట్రాక్టర్ సీజ్

రంగంపేట: దమ్ము ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్సై శివ ప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ కోటపాడులో ఫుల్‌వీల్స్ వేసుకుని ఏడీబీ రోడ్డు మీద దమ్ము ట్రాక్టర్ నడుపుతున్నట్టు సమాచారం అందడంతో వెంటనే వెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. పొలాలో దమ్ములు చేసిన తర్వాత ట్రాక్టర్లను నేరుగా ఆ చక్రాలతో రోడ్ల పైకి తీసుకొస్తున్నారు. దీంతో కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లు ఛిద్రం అవుతున్నాయన్నారు. రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.